

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు : కలెక్టర్


సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి- రాయచోటి : స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీల పరిష్కారంలో ఎట్టి పరిస్థితిలో అలసత్వం వహించకుండా సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ గిరీష పిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టరుతోపాటు డిఆర్ఒ సత్యనారాయణ, కలెక్టరేట్ ఎన్‌డిసి శ్రీలేఖ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అర్జీదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఎ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కడప ప్రగతిపై అంతులేని నిర్లక్ష్యం

పదేళ్లుగా 'ఉక్కు' ఆశలు హుళక్కి!
ప్రాజెక్టు పనుల్లో పురోగతి ప్రశ్నార్థకం
హార్టీ హబ్ హామీ బుట్టదాఖలు
నాడు టిడిపి.. నేడు వైసిపి దొంగాట
కడప జిల్లాకు చేరుకోనున్న సిపిఎం ప్రజా రక్షణభేరి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప సమగ్రాభివృద్ధిపై అంతులేని నిర్లక్ష్యం నెలకొంది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాలో ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఆశించిన పురోగతి కొరవడింది. జిల్లా కరువుకు కేరాఫ్ అడ్రెస్‌గా మారింది. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు పనుల్లోనూ ఎటు వంటి పురోగతి కనిపించడం లేదు. 2017లో వరదల్లో గల్లంతైన ఎల్ఎస్‌పి గేట్ల సాక్షిగా మిగిలిన 12 ప్రాజెక్టు పనుల్లో ఆశించిన పురోగతి కనిపించలేదు. మహానగరాలకే పరిమితమైన ఆర్కిటెక్చర్ యూనివర్శిటీని కడప గడపలో ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ కాగితాలకే పరిమితమైంది. టిడిపి ప్రభుత్వం జిల్లాను హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తామన్న వాగ్దానం నీటి మూటను తలపిస్తోంది. ప్రతిపక్ష నేత హోదాలో జగన్ మూడున్నరేళ్లలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అందని ద్రాక్ష పుల్లన సామెత చందంగా మారింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎండగట్టేందుకు సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 30న కర్నూలు జిల్లాలో మొదలుపెట్టిన ప్రజా రక్షణభేరి యాత్ర మంగళవారం సాయంత్రానికి మైదుకూరుకు చేరుకోనుంది. అనంతరం బద్వేల్ మీదుగా కడప, ఎర్రగుంట్ల ప్రాంతాల మీదుగా బస్సుయాత్ర సాగనుంది.

సాగునీటి ప్రాజెక్టుల పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలోని గండికోట, సర్వరాయసాగర్, వామికొండ ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టు ఎప్పటికీ సాగులోకి వస్తుందో తెలియడం లేదు. ప్రభుత్వం ప్రాజెక్టు పనుల పూర్తికి నిధుల కేటాయింపులు చేయకపోవడంతో మూడు అడుగులు ముందుకు ఆరు అడుగులు వెనక్కి చందంగా మారింది. రూ.212 కోట్లతో కూడిన సర్వరాయసాగర్ ప్రాజెక్టు రివిట్‌మెంట్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. జిఎన్ఎస్ఎస్ ప్యాకేజీ-1, 2 పనులు చేసిన అవెక్సా కంపెనీకి రూ.150 కోట్ల బిల్లులు చెల్లింపులు చేయక పోవడంతో సర్వరాయసాగర్ రివిట్‌మెంట్ పనులు అడుగు ముందుకు పడడం లేదని సమాచారం. తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్, ఎగువసగిలేరు, దిగువ సగిలేరు ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీరందించలేని పరిస్థితి నెలకొంది. తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలోని బ్రహ్మంసాగర్ లీకేజీ వ్యవహారం కొలిక్కి రావడం లేదు. ఫలితంగా 17 టిఎంసిలను పూర్తిస్థాయిలో నిల్వ చేయ లేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా 1.78 లక్షల ఎకరాల ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. పొరుగునున్న ప్రకాశం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. ఫలితంగా పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల్లోని ఐదు వేల ఎకరాల ఆయకట్టు సాగు కొలిక్కి రావడం లేదు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి జగన్ 25 శాతంలోపు పనులు చేసిన సాగునీటి ప్రాజెక్టుల టెండర్లు, గాలేరు-నగరి ప్రాజెక్టులో అంతర్భాగమైన మూడవది మినహా మిగిలిన ఆరు ప్యాకేజీలను రద్దు చేసింది.


ఈ ఏడాది ఫిబ్రవరి 14న జమ్మలమడుగు మండలంలోని సున్నపురాళ్లపల్లె వద్ద ఉక్కు పరిశ్రమ శంకుస్థాపన చేస్తున్న సిఎం జగన్

కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలనే రాష్ట్ర విభజన హక్కు పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతోంది. కేంద్రంలోని బిజెపి సర్కారు ఉద్దేశ పూర్వకంగా పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్న హామీని తొక్కి పెట్టింది. 2017లో ప్రతి పక్ష నేత హోదాలో చేపట్టిన పాద యాత్రలో మూడున్నరేళ్లలో పరిశ్రమను ఏర్పాటు చేస్తా మని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఇచ్చిన హామీలు నీరో డుతున్నాయి. కేంద్రలోని బిజెపి సర్కారు వెనుకబడిన ప్రాం తాలకు నిధులు కేటాయించాలనే నిబంధనల్ని తుంగలో తొక్కింది.

రూ.376 కోట్లతో కూడిన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని సూపర్‌స్పెషాలిటీ, కేన్సర్ కేర్, సైక్రియాటిక్ ఆస్పత్రుల భవన నిర్మాణాలు పూర్తి చేయడం, ఏర్పాటు చేస్తామని హామీ ఊరట కలిగించడం మినహా ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. మైదుకూరు నియోజకవర్గంలో అరుదైన పంటగా గుర్తింపు పొందిన కెపి ఉల్లి, పసుపు సాగు ప్రశ్నార్థకంగా మారింది. కెపిఉల్లి ఉత్పత్తుల నిల్వకు కోల్డ్‌స్టోరేజీ నిర్మాణం మద్దతు ధర కల్పనపై నిర్లక్ష్యం మేటలు వేసింది. బద్వేల్‌కు సోమశిల రిజర్వాయర్ నుంచి తాగునీటి లిఫ్ట్ ఇరిగేషన్ ఎప్పటికి సాకారమవుతాయో తెలియడం లేదు.

నేడు మైదుకూరు, బద్వేల్, కడపలో బహిరంగ సభలు
సిపిఎం నేతలు ఎం.ఎ.గఫూర్, ప్రభాకర్‌రెడ్డి రాక

ప్రజా రక్షణభేరి పేరిట సిపిఎం ఆధ్వర్యంలో తలపెట్టిన బస్సు యాత్ర మంగళవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి మైదుకూరు పట్టణానికి చేరుకుంటుంది. అక్కడి నుంచి బద్వేల్‌కు చేరుకుంటుంది. అక్కడి నుంచి మధ్యాహ్నం కడపలో తలపెట్టిన బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకోనుంది. జిల్లాలోని మైదుకూరు, బద్వేల్, కడప పట్టణాల్లో నిర్వహించనున్న బహిరంగ సభలకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణయ్య, ఉమామహేశ్వరరావు హాజరుకానున్నారు. మధ్యాహ్నానంతరం యర్రగుంట్ల మీదుగా అనంతపురం జిల్లాలో అడుగుపెట్టనుంది.

సురక్ష శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ గిరీష


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష, గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో, తదితర అంశాలపై మెడికల్ ఆఫీసర్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను అన్ని మండలాల్లో జాగ్రత్తగా చిన్నపాటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించి నిర్వహించాలన్నారు. శిబిరాల్లో ఒపి డేటా ఎంట్రీ తప్పకుండా చేయించాలని మందుల పంపిణీ కేంద్రంలో ఫార్మసిస్టు ఖచ్చితంగా అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి ఒక్కరి ఫోన్లో ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి లాగిన్ చేయించారా లేదా అనేది పరిశీలించాలన్నారు. ప్రజలకు ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించి మందులు అందజేయాలన్న ముఖ్య ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. జిల్లాలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య శిబిరాలలో ఎక్కడెక్కడ కంటి ఆపరేషన్లు జరిగాయి, అందుకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడూ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌చేసి ఆన్‌లైన్ రిపోర్టు తమకు పంపాలని చెప్పారు. మెడికల్ ఆఫీసర్లు, ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఎప్పటికప్పుడూ విజిట్ చేసి రిపోర్టు పంపాలన్నారు. జిల్లాలో బడి బయట ఉన్న బడి ఈడు పిల్లల నమోదు (గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో) చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోకు సంబంధించి 5-18 సంవత్సరాల మధ్య ఉన్న ప్రతి పిల్లవాడిని పాఠశాలలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 10వ తరగతి, ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులను మరల తిరిగి పాఠశాలల్లో, కళాశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వారికి అమ్మ ఒడి పథకం వస్తుందనే విషయాన్ని తెలియచేయాలని, ఒక వేళ వారు చేరకపోతే ఓపెన్ స్కూల్ లోనైనా చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఇఒలు పూర్తి స్థాయిలో సమన్వయం చేసుకొని వంద శాతం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పూర్తి చేయాలన్నారు. ఎంఇఒలు వారి పరిధిలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ లేని గ్రామంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ముగిసిన అండర్-19 బాస్కెట్‌బాల్ పోటీలు


విన్నర్స్, రన్నర్స్ జట్లకు ట్రోఫీలను అందజేస్తున్న చైర్‌పర్సన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్కూల్ గేమ్స్ అండర్-19 రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు పట్టణంలోని జిఆర్‌టి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ మైదానంలో సోమవారం ముగిశాయి. అండర్-19 బాలుర విభాగం ఫైనల్స్‌లో తూర్పుగోదావరి, కృష్ణా జట్లు తలపడగా తూర్పుగోదావరి జట్టు విన్నర్స్, కృష్ణా జట్టు రన్నర్స్‌గా నిలిచింది. పశ్చిమగోదావరి మూడో స్థానం, విశాఖపట్నం జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. బాలికల విభాగం ఫైనల్స్‌లో అనంతపురం-పశ్చిమగోదావరి జట్లు తలపడగా అనంతపురం జట్టు విన్నర్స్, పశ్చిమ గోదావరి జట్టు రన్నర్సుగా నిలువగా, తూర్పుగోదావరి మూడో స్థానం, గుంటూరు జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజరెడ్డి హాజరై మాట్లాడుతూ ఈ పోటీలు ఎంతో హోరాహోరీగా జరగడంతో క్రీడాకారులను ఆద్యంతం ఆకట్టుకున్నాయన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం 23వ వార్డు కౌన్సిలర్ గిరిజ సాయిశేఖర్ రెడ్డి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణ మూర్తితో కలిసి ఆమె విన్నర్స్, రన్నర్స్ జట్లకు ట్రోఫీలను అందజేశారు. క్రీడాకారులకు మెడల్స్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రాధాన్యత భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను నిర్దేశించి గడువు లోపల పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష పిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ గిరీష ప్రభుత్వ ప్రియారిటి భవన నిర్మాణాలపై పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన గ్రామా వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ప్రియారిటీ భవన నిర్మాణాలకు ఎంతో ప్రాధాన్యతనిస్తుందని భవన నిర్మాణాలలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి మండలానికి వారానికి నిర్దేశించిన లక్ష్యాలను ఆవారంలోగానే పూర్తి చేయాలని ఎంపిడిఒలను, ఇంజినీర్లు ఆదేశించారు. ప్రియారిటీ భవన నిర్మాణాలు అత్యంత ప్రమాణాలతో రూపుదిద్దుకొనేటట్లుచూడాలన్నారు. నిర్మాణాలకు సంబంధించి అవసరం మేరకు సిమెంటు ఇండెంట్లు పంపాలన్నారు. జిల్లాలో భవన నిర్మాణాలకు సంబంధించి రోజురోజుకూ పురోగతి కనిపించేలా ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను పరిశీలించాలని చెప్పారు. రైతులకు కావాల్సిన విత్తనాలు ఎరువులు, పురుగు మందులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేస్తారని, అందువల్ల అధికారులు ఆర్‌బికె భవన నిర్మాణాలలో నిర్లక్ష్యం చేయకూడదని చెప్పారు. ఈ సందర్భంగా భవన నిర్మాణాలలో వెనుకబడిన మండలాల అధికారులతో కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రాజంపేట పట్టణం ప్రభుత్వ బాలికల సమీకృత వసతి గృహంలో పనిచేస్తున్న వార్డెన్ శోభారాణిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, సిఐటియు జిల్లా కార్యదర్శి రామంజులు డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో కలెక్టర్ గిరిషకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు మోనూను అమలు చేయడం లేదని తెలిపారు. గతంలో కలుషిత ఆహారం, విద్యార్థినిలు తప్పిపోవడం వంటి కారణాలతో ఆమె పర్యవేక్షణ లోపం కారణంగా రెండుసార్లు సస్పెండ్‌కు గురయ్యారని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఆమెకు అక్కడే మళ్ళీ పోస్టింగ్ ఇచ్చారన్నారు. ప్రతి హాస్టల్ వార్డెన్స్ స్థానికంగా నివాసం ఉండాల్సి ఉంటే కానీ ఈమె మాత్రం కడప నుండి రాజంపేటకి వాస్తు పోతుందని పేర్కొన్నారు. వారానికి 2 లేదా 3 రోజులు హాస్టల్‌లో వుంటుందని కనుక హాస్టల్ వార్డెన్ శోభారాణిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంత వ్యవహారం నడపడానికి కల కారణం అధికారుల అండదండలతో రెచ్చిపోతుందని మండి పడ్డారు. చర్యలు తీసుకొని పక్షంలో ప్రత్యక్షమైన ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చందు, విష్ణు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** వార్డెన్ శోభారాణి పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు. వసతి గృహంలో జరుగుతున్న అవకతవకలపై ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఒకు వినతి పత్రం సమర్పించారు. హాస్టల్ వార్డెన్ శోభారాణిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆమెకు శాఖా పరంగా సహకారం అందిస్తున్నారని, ఇతర శాఖ నుంచి శోభారాణి పై విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉపేంద్ర, హరి, దినేష్, నాసర్, వెంకట్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి : ఎమ్మెల్యే


విన్నర్స్, రన్నర్స్ జట్లకు ట్రోఫీలను అందజేస్తున్న చైర్‌పర్సన్

ప్రజాశక్తి - రాయచోటిటౌన్

ఇళ్ల నిర్మాణాలలో వేగం పెంచాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాతో కలిసి గృహ నిర్మాణ, మున్సిపల్ శాఖల అధికారులతో రాయచోటి నియోజక వర్గ వ్యాప్తంగా నిర్వహిస్తున్న వైఎస్ఆర్ జగనన్న కాలనీలు, ఇతర హౌసింగ్ నిర్మాణాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పేదలకు పక్కా గృహాల నిర్మాణాలును కల్పిస్తోందన్నారు. నియోజక వర్గంలో 19,476 గృహాలు మంజూరైతే 5978 పూర్తయ్యాయని చెప్పారు. రూఫ్‌లెవల్ 1393, ఆర్‌సి 1107, బేస్‌మెంట్ 6205, నాన్ స్టార్టెడ్ 1947, బిబిఎల్ 2846 దశలలో ఉన్నాయని చెప్పారు. నియోజక వర్గ వ్యాప్తంగా సుమారు 4 వేల గృహాల నిర్మాణాలు ఇప్పటికీ ప్రారంభం కాలేదన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 1000, మిగిలిన మండలాలలో 3 వేలు నిర్మాణాలు నవంబర్ చివరి కల్లా ప్రారంభం కావాలని అధికారులను ఆయన ఆదేశించారు. నియోజక వర్గ పరిధిలోని అన్ని మండలాలు, లే అవుట్ల వారిగా ఇళ్ల నిర్మాణాల స్థితిగతులపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోనే గాలివీడు మండలం మంచి ప్రొగ్రెస్‌లో ఉండడం హర్షణీయమన్నారు. జగనన్న కాలనీలలో తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రెయినేజీలు, తదితర మౌలిక వసతుల కల్పనపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జగనన్న కాలనీల ఆర్చి నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆయన సూచించారు. మండలాల వారీగా ఎన్నెన్ని మంజూరు అయ్యాయో ఆరా తీశారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సాంబశివయ్య, ఇఇ పూల చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, అన్ని మండలాల హౌసింగ్ ఎఇలు పాల్గొన్నారు.

సర్వేయర్‌ను అరెస్టు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - రాయచోటి

పీలేరు తహశీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న రెడ్డన్నపై దాడికి ప్రయత్నించిన అధికార పార్టీ వైసిపి నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలని జిల్లా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు డిసి వెంకటయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు వివాదంలో ఉన్న భూమికి తాను సర్టిఫికెట్ ఇవ్వడం కుదరని దానికి సర్వేయర్ రెడ్డన్నపై వైసిపి నేతలు అనిల్‌రెడ్డి, సునీల్‌రెడ్డి దుర్భాషలాడుతూ దాడికి ప్రయత్నించడం హేయమైన చర్యని పేర్కొన్నారు. తాము చెప్పినట్లు నడుచుకొని అధికారులను ఇబ్బంది పెట్టడం భయభ్రాంతులకు గురిచేయడం, బెదిరించడం వీరు అలవాటుగా మారింది అన్నారు. ఇప్పటికైనా అధికారులపై దాడి చేయడం మానుకోవాలని చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కావలిలో ఆర్‌టిసి డ్రైవర్‌పై మూకుమ్మడిగా దాడి చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

'అన్నమయ్య' బాధితులను ఆదుకోండి

ప్రజాశక్తి - రాయచోటి

అన్నమయ్య డ్యామ్ బాధితులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే అర్.రమేష్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగలరాయుడు, టిటిడి పాలక మండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు, నరసింహ ప్రసాద్ జనసేన నాయకులు తాతం శెట్టి నాగేంద్ర, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కసానుబాష పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలక్టరేట్ కార్యలయం దగ్గర జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఎన్నాళ్ళు ఎన్నేళ్ళు ఈ కన్నీళ్ల అన్నమయ్య డ్యామ్ బాధితులను ఆదుకోండి సిఎం అని నిరసన కార్యక్రమంలో ఏర్పాటు చేశారు. ఈ సంధ్బంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య జలాశయం కొట్టుకుపోయి ప్రాణ, ఆస్తి నష్టం జరిగి రెండేళ్లు కావస్తున్న ప్రభుత్వం ఎలాంటి సదుపాయాలు కల్పించకపోవడం దుర్మార్గమని చెప్పారు. నష్టం జరిగిన బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరుతూ జనసేన ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాయకులకు సంఘీభావం తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అతికారి దినేష్, మణి, జనసేన వీర మహిళ రెడ్డి రాణి, శ్రీరామ శ్రీనివాసులు, టిడిపి నాయకులు, సుగవాసి శ్రీనివాసులు, మన్నేరు రామాంజనేయులు, రవి పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి : ఎస్ఐ

ప్రజాశక్తి-రామాపురం : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి తన విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మండలంలోని బండపల్లి టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించి వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలో ఎక్కువ భాగం జాతీయ రహదారులు ఉండడంతో అధిక సంఖ్యలో వాహనాలు రద్దీ ఎక్కువగా ఉంటుందని ద్విచక్ర వాహనదారులు పరిమిత వేగంతో వాహనాలు నడపాలని చెప్పారు. ప్రమాదాలు జరిగిన ఎక్కువ మంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా తన విలువైన ప్రాణాలు ఎంతోమంది కోల్పోయారని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని ఆయన సూచించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాన్ని నడపరాదని వాహనానికి సంబంధించిన ఆర్‌సి లైసెన్సు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని వాహనదారులకు ఆయన సూచించారు.

మల్లయ్య కొండకు గోదానం

ప్రజాశక్తి-తంబళ్లపల్లె : తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంభికా సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి సోమవారం ఓ భక్తురాలు గోదానం చేశారు. సోమవారం పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన పెద్దపల్లెకు చెందిన సుమిత్రమ్మ తన ఇంట పుట్టిన గోవును మల్లయ్య కొండ ఆలయానికి దానంగా ఇచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. ఆమె దానగుణాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కెఆర్ మల్‌రెడ్డి, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, పూజారి ఈశ్వరప్ప, మల్లికార్జున, సహదేవాలు అభినందించారు. అనంతరం గౌరమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి శేఖర్ అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో అభిషేకాలు నిర్వహించి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

విజ్ఞాన మేళాను సద్వినియోగం చేసుకోండి : డిఇఒ

ప్రజాశక్తి- రాయచోటి

విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, నైపుణ్యాలనీ విజ్ఞానాన్ని వెలికితీసి ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న కాలమ్స్ విజన్-2023 కార్యక్రమాన్ని జిల్లాలోని హైస్కూల్ విద్యార్థులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం తెలిపారు. సోమవారం స్థానిక ప్రతిభ కళాశాలలో ఆర్గనైజర్, ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం డిఇఒ మాట్లాడుతూ కాలమ్స్ విజన్ - 2023లో ప్రతి విద్యార్థి శాస్త్ర విజ్ఞానం పట్ల ఉత్సాహం చూపించి, శాస్త్రవేత్తలుగా ఎదగాలని తద్వారా రాష్ట్రానికి, దేశానికి ఉపయోగపడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలలు పాల్గొనాలని కోరారు. విజ్ఞాన మేళాకు జిల్లా విద్యాశాఖ సంపూర్ణ సహకారాలు అందిస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞాన శాస్త్ర అభివృద్ధికి కృషిచేస్తోందన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకను వెలికితీసేందుకు, సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు కాలమ్స్ విజన్ విజ్ఞానమేళాను వినయ్‌కుమార్ నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. శివగంగిరెడ్డి మాట్లాడుతూ మానవ మనుగడకు సైన్సు ఎంతగానో ఉపయోగ పడుతోందన్నారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులు విజ్ఞానం పట్ల ఆసక్తి చూపాలన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం అలవాటు చేసుకోవాలని, అప్పుడే అప్పుడే మనం అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. కాలమ్స్ విజన్ సైన్స్ ఎగ్జిబిషన్ పాల్గొని ప్రతి ఒక్కరూ వారి ప్రాజెక్టులను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ మెరిట్ హై స్కూల్ ప్రిన్సిపల్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ కాలమ్స్ విజన్ కార్యక్రమాన్ని తమ పాఠశాలలో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, విద్యార్థుల కోసం తమ వంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్, ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులందరూ తమ ప్రాజెక్టులను ప్రదర్శించవచ్చు పేర్కొన్నారు. కాలమ్స్ విజన్ - 2023లో ఈ నెల నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభించినట్టు అయిన తెలిపారు. పూర్తి వివరాలకు 6281453550, 9391932752లలో సంప్రదించాలి అన్నారు. నవంబర్లో 28 ,29 ఇంటర్నేషనల్ మెరిట్ హైల్‌లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్ రూపొందించిన ప్రతి విద్యార్థికీ ప్రశంస పత్రం, జ్ఞాపికను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉండే ప్రతి ఒక్క పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిఇఒ పురుషోత్తం


రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

వేగవంతంగా అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయని మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ సోమానుపల్లి కాలనీ రోడ్డుకు స్థానిక సర్పంచ్ నూతన కాల్వ రెడ్డమ్మ నరేంద్రరెడ్డి, ఎంపిపి నరసింహులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గుర్తించిన అంతర్గత రోడ్డు నిర్మాణ పనులను దశలవారీగా ప్రారంభించినట్లు తెలిపారు. మూడవ దశలోని పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. సోమానుపల్లి కాలనీకి 110 మీటర్ల సిమెంటు రోడ్డుకు సుమారు రూ.5 లక్షలకు పైగా ప్రభుత్వ నిధులను వెచ్చించి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా పల్లెలకు ఇదివరకే గుర్తించిన అంతర్గత రోడ్డులను డిసెంబర్ నెలలోపు మొత్తం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటున్న ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి జయప్రకాశ్‌రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు సదాశివరెడ్డి, మాజీ మండలాధ్యక్షులు ఆర్‌ఐ.రమణారెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు రెడ్డి శేఖర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామ మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు సుబ్రమణ్యం, మహదేవరెడ్డి, నాయకులు నరేంద్రరెడ్డి, చంద్రమోహన్, శశిధర్‌రెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, ఎంపిడిఒ శేషగిరిరావు, తహశీల్దార్ మంజుల, పంచాయతీ కార్యదర్శి మారప్ప పాల్గొన్నారు.


స్పందనను అభినందిస్తున్న జనసేన నాయకులు

విద్యార్థికి నగదు బహూకరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

2022-23 విద్యా సంవత్సరంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతిలో514 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన మండల పరిధిలోని కొండ్లోపల్లికి చెందిన నంద్యాల స్పందనకు జనసేన నాయకులు ఇడిమడకల సాయి శ్రీనివాస్, బాలసాయి కృష్ణ, అబ్బిగారి గోపాల్ నంద్యాల హరి ఆధ్వర్యంలో సోమవారం రూ.6 వేలు నగదు బహూకరణ చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ దళిత కుటుంబానికి చెందిన విద్యార్థిని ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. దళిత కుటుంబాలలోని బాల బాలికలు విద్యారంగంలో రాణించేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మన్నేరు సూరిబాబు, నంద్యాల హరి పాల్గొన్నారు.

సర్వేయర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-కలికిరి

పీలేరు తహశీల్దార్ ఆఫీసులో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న రెడ్డెప్పపై దాడికి ప్రయత్నించిన నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని బిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏదైన సమస్య ఉంటే ఆశాఖ పైఅధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవడం మాని ఉద్యోగిపై దౌర్జన్యం చేయడం సహించరానిదన్నారు. ఇలాంటి దాడులను ఉద్యోగ సంఘాలు చూస్తూ ఊరుకోబోవన్నారు. బాధితుడి పక్షాన బిసిఇఎఫ్ అండగా నిలిచి తగు న్యాయం కోసం పోరాడతామన్నారు. ఇలాంటి దురాగతాలను పైఅధికారులు, న్యాయస్థానం దృష్టికి, ప్రజల్లోకి తీసుకెళ్ళి మరోసారి పునరావృతం కాకుండా యత్నిస్తామని తెలిపారు. ఆర్‌టిసి డ్రైవర్ సింగ్ పైనా మూకుమ్మడిగా దారుణంగా దాడి చేసిన ఘటన ప్రతి ఉద్యోగి, ప్రజలనూ కలచివేసిందన్నారు. ఇంత హేయంగా ప్రవర్తిస్తున్న వారికి వెనుక ఏ భరోసా ఉందో అర్థం కావడం లేదన్నారు. భౌతిక దాడులతో భయపెట్టుతూ ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతీసి, గౌరవభంగం కలిగించే ఈ ఘటనలపై చర్యలు చేపట్టి, తిరిగి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలు చేపట్టాలన్నారు.


సిబ్బందితో సమావేశమైన తహశీల్దార్ రామమోహన్

సిబ్బంది పనితీరుపై తహశీల్దార్ అసహనం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

సిబ్బంది పనితీరు పట్ల తహశీల్దారు రామమోహన్ అసహనం వ్యక్తం చేశారు. సోమవారం స్పందనలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు, విధులకు సక్రమంగా హాజరు కాకుండా కుంటి సాకులు చెబుతున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు త్వరలో ఎన్నికలు నోటిఫికేషన్ కూడా వెలువడే అవకాశం ఉందని కనుక ఎన్నికలకు సంబంధించిన నోటీసులు అందజేయవలసి ఉంటుందని కనుక కుంటి సాకులు మాని సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకావాలని ఆయన హెచ్చరించారు. **గంటల తరబడి వేచి ఉన్న అర్జీదారులు:** ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీదారులు కార్యాలయం వెలుపల గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది, తహశీల్దారు మధ్యాహ్నం వరకు సిబ్బందితో సమావేశం నిర్వహిస్తుండడం వలన అర్జీదారులు కార్యాలయం వెలుపల గంటల తరబడి వేచి చూస్తూ నిరాశ చెందుతున్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికే స్పందన కార్యక్రమం ప్రభుత్వ నిర్వహిస్తోంది. గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది.

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రభుత్వ ఆసుపత్రులల్లో పేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నట్లు మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం ముషూరులోని కెజిబివి పాఠశాల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ చంద్రాయుడు ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు, ఎంపిడిఒ శేషగిరిరావు, తహశీల్దార్ మంజుల నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ వైద్య ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు ప్రజల ఆరోగ్యాన్ని సర్వే చేసి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి,వారికి వైద్య బృందమే నేరుగా ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలను, వైద్య సేవలను అందించి, మందులను పంపిణీ చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ స్థాయిలోనే జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించి, మహిళలకు, వృద్ధులకు, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి, బిసి, షుగర్ వంటి సమస్యలు కలిగిన వారికి 104 రకాల పరీక్షలు చేసి వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకుని ఆసుపత్రిలో ఉన్న రోగికి ఆర్థిక సాయంగా సుమారు 5 వేల రూపాయల వరకు ప్రభుత్వం అందించి వారి కుటుంబానికి అండగా నిలబడుతున్నాదని పేర్కొన్నారు. నేడు ప్రభుత్వ ఆసుపత్రులు కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా పనిచేస్తున్నాయని వివరించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సదుపాయాలను కల్పించినట్లు వివరించారు. అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన పోషకాహార విలువలను వివరించే ప్రత్యేక శిబిరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గిర్భణులు, బాలింతలు పోషకాహార వెలుగులకై ఆకుకూరలు, కోడిగుడ్లు, కూరగాయలను క్రమం తప్పకుండా తీసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, వైసిపి మండల అధ్యక్షులు సదాశివరెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపిపి జయప్రకాశ్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు ఆర్‌ఐ రమణారెడ్డి, డాక్టర్ దీక్షితా రాణి, సర్పంచ్‌లు చంద్రాయుడు, వైసిపి నాయకులు రమణారెడ్డి, కొండగాళ్ల రమణ, విజయ్ కుమార్‌రెడ్డి, అంగన్వాడీ సూపర్వైజర్ భాను లక్ష్మీదేవి పాల్గొన్నారు. **గుర్రంకొండ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజల కోసం ప్రవేశపెట్టిన పథకం జగనన్న ఆరోగ్య సురక్ష ఈ పథకాన్ని సోమవారం మండలంలోని


నిమ్మనపల్లె : మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

చెర్లోపల్లి గ్రామంలో నిర్వహించారు. పేద ప్రజలకు అనేక రకాల వ్యాధులను పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు యోగేంద్ర, జడ్‌పిటిసి ముక్తియార్, వైసిపి మండల నాయకులు సుధీర్‌రెడ్డి, రెడ్డమ్మ కొండ చైర్మన్ నరహరిరెడ్డి, చల్లోపల్లి సర్పంచ్ ప్రమీల, బివి రెడ్డి, అధికారులు, ప్రజా పతినిధులు పాల్గొన్నారు. **రామాపురం :** జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం లాంటిదని ఎంపిడిఒ హైదరవల్లి, వైద్యాధికారి విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని సరస్వతి పల్లి సచివాలయం వద్ద సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రాధాన్యత గురించి ప్రజలకు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో పలు రకాల వ్యాధులకు సంబంధించి ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామాలలో నిర్వహించే ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పలు వ్యాధులకు సంబంధించిన వైద్యాధికారులు వ్యాధిగ్రస్తులకు చికిత్సలు చేసి వారికి ఉచితంగా మందులు ఇవ్వడమే కాకుండా దీర్ఘకాలికంగా అనుభవిస్తున్న వారికి పెద్ద ఆసుపత్రులలో చికిత్సలు చేయిస్తున్నారని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు . కార్యక్రమంలో వైద్యాధికారి, వినోద్‌కుమార్, ఉపసర్పంచ్ పద్మజ, ఎంపిటిసి నాగభూషణమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మజ, కార్యదర్శి సంజీవరెడ్డి, వైసిపి నాయకులు సూరం వెంకటసుబ్బారెడ్డి, చంద్రయ్య, సత్యనారాయణరెడ్డి, వెంకటసుబ్బయ్య సచివాలయ, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేరుశనగ విశిష్ట రకం లాభదాయకం


వేరుశనగ కాయలను తూకం వేస్తున్న రైతు

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని కొర్లకుంటలో సోమవారం కృషి విజ్ఞాన కేంద్రం కలికిరి వేరుశనగలో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. నూనె గింజల్లో సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాలలో భాగంగా జాతీయ ఆహార భద్రత మిషన్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగలో కొత్తగా వచ్చిన రకం టిసిజిఎస్-1694 (విశిష్ట) తిక్క ఆకు మచ్చ తెగులు, తుప్పు తెగుళ్లను తట్టుకుంటుందని శాస్త్రవేత్తలు డాక్టర్ జిఎస్ పాండురంగ, కెవికె సమన్వయకర్త తెలిపారు. ఈ రకం నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటుందని చెప్పారు. ఈ రకం చెట్టుకి 20 నుండి 25 కాయలు వస్తాయన్నారు. కొర్లకుంట రైతు ఆదినారాయణ మాట్లాడుతూ ఈ రకం వేరుశెనగ వర్షం ఆధారంగా సాగు చేయగా 100 నుండి 105 రోజుల్లో పంటకాలంగా చెబుతూ, ఎకరాకు 15 నుంచి 18 బస్తాలు దాకా దిగుబడి వస్తుందని వివరించారు. వేరుశనగలు అధిక దిగుబడినిచ్చే రకం టిసిజిఎస్-16 94 (విశిష్ట) అని చెప్పారు. ఈ రకం వేరుశనగ ఇప్పటికే బాగా ప్రాచుర్యమైందన్నారు. ఈ రకం బెట్ట పరిస్థితులో కూడా మంచి ఫలితాన్ని ఇస్తుందని ప్రత్యక్షంగా చూపించడానికే ఈ రోజు ఈ క్షేత్ర దినోత్సవం నిర్వహించామన్నారు. కోత అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరిస్తూ కాయలలో తేమ 8 నుండి 9 శాతం వచ్చేవరకు అరబెట్టాలని, ఒక వేళ విత్తనం కొరకు ఈ కాయలు వాడుకోవాలంటే నీడలో ఆరబెట్టాలని 40 డిగ్రీల కన్నా అధికంగా ఉష్ణోగ్రతలు ఉంటే విత్తనం కోసం నిలువవుంచే కాయలలో వేపాకులు గాని వేప గింజల పొడి గాని వేసి నిల్వ చేస్తే పురుగుల ఉధృతి తగ్గుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్.సోమశేఖర్ బాబు, కె.మాధురి, డాక్టర్ ఎ.శ్రీనివాసులు, రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సహాయకులు లోకేశ్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ వాల్మీకి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వాల్మీకుల ఎస్‌టి సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతామని రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ దక్షిణ భారత దేశ అధ్యక్షులు గంపల గంగరాజు ప్రకటించారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర, జిల్లా కమిటీలకు ప్రతినిధులను నియమిస్తూ వారికి నియామక పత్రాలను అందజేశారు. వాల్మీకులు జాతీయ స్థాయిలో ఐక్యంగా తమ వానిని వినిపించి, ఎస్‌టి సాధన కోసం ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ శాలువ, పూలమాలలు వేసి వారిని అభినందిస్తూ శుభా కాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా మేకల విజయ్ మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పూలకుంట్ల హరి, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులుగా టేకుపల్లి శ్రీనివాసులు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా బొగ్గిటి కృష్ణమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మురా కృష్ణమూర్తి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులుగా పిడుగు రఘునాద్, జిల్లా ఉపాధ్యక్షులుగా మేకల వెంకటరమణలను నియమించామని పేర్కొన్నారు. వీరందరికి బొగ్గిటి కృష్ణమూర్తితో కలిసి దక్షిణ భారతదేశ అధ్యక్షులు గంపల గంగరాజు నియామక పత్రాలు అందించి బాధ్యతలు అప్పజెప్పారు. జాతీయ స్థాయిలో కలసికట్టుగా అందరినీ సమన్వయం చేసుకొని ముందుకు సాగినప్పుడు మాత్రమే హక్కులను సాధించుకునే అవకాశం ఉన్నందున రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ నిర్మాణాన్ని పూర్తి స్థాయిలో చేపట్టి పోరాడుతామని వెల్లడించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు మేకల విజయ్ మోహన్ మాట్లాడుతూ తమపై విశ్వాసంతో



నియామక పత్రాలు అందజేస్తున్న నాయకులు

అప్పగించిన బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వర్తిస్తామని పేర్కొన్నారు.అవకాశం కల్పించిన దక్షిణ భారతదేశ అధ్యక్షులు గంపల గంగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలు తీసుకున్న ప్రతినిధులు మాట్లాడుతూ వాల్మీకుల ఎస్టీ లక్ష్యసాధన కోసం శక్తివంచను లేకుండా సేవలందించి రాష్ట్రీయ వాల్మీకి ధర్మసమాజ్ ఉనికిని చాటి చెబుతామని స్పష్టం చేశారు. రాష్ట్ర, జిల్లా కమిటీ ప్రతినిధులుగా ఎన్నికైన వారికి పలువురు శుభాకాంక్షలు చెప్పి అభినందించారు. కార్యక్రమంలో వాల్మీకి సోదరులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజా శ్రేయోభిలాషి సిఎం జగన్ : 'చింతల'

ప్రజాశక్తి- కలకడ

ప్రజా శ్రేయోభిలాషి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గంగాపురం, దొడ్డిపల్లి పంచాయతీలలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజా శ్రేయస్సు కోరి ఎన్నికల ముందు ప్రకటించిన నవరత్న అమలు చేసి చరిత్రలో మిగిలిపోయారని కొనియాడారు. గంగాపురం పంచాయతీలో వడ్డిపల్లి నీటి సమస్య ఉన్నట్లు ప్రజల తెలపడంతో వెంటనే పైపులైను మోటర్ ఏర్పాటు చేసి సమస్యను పరిశీలించిన తెలిపారు.ఈ పంచాయతీలలో పింఛన్లు గ ృహములు రానివారికి లేనివారికి వెంటనే మంజూరు చేసి తన నిజాయితీని చాటుకున్నారు. గ్రామీణ ప్రాంతాలలో సమస్యలను గుర్తించి అక్కడక్కడ పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, జడ్‌పిటిసి హారిక, మండల పార్టీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగల్ విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, గంగాపూర్ సర్పంచ్ రామచంద్ర, మాజీ సర్పంచ్ జనార్దన్ నాయుడు, నాయకులు రవికుమార్, కుమార్ రెడ్డి గుర్రప్ప, పురుషోత్తం, తరిగొండ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలో జగనన్న కాలనీలు, గ్రామాలలో మంజూరు చేసిన జగనన్న ఇళ్ల నిర్మాణపు పనుల త్వరగా పూర్తి చేసేందుకు చొరవ చూపాలని హౌసింగ్ డిఇ శ్రీహరి రావు ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. సోమవారం హౌసింగ్ ఎఇ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వారి వారి పరిధిలో ఇండ్ల నిర్మాణంలు త్వరగా పూర్తి చేసేందుకు చొరవ చూపాలన్నారు. ఇప్పటివరకు మంజూరైన పనులు ప్రారంభించిన లబ్ధిదారులతో చర్చించి ఇంటి నిర్మాణపు పనులు ప్రారంభించే విధంగా కృషి చేయాలన్నారు. నవంబర్ నెల ఆఖరికల్లా అనుకున్న లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఎఇ సుజాత, ఇంజిరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సూక్ష్మ వడ్డీ రుణాల బారిన పడొద్దు

ప్రజాశక్తి-పీలేరు

సూక్ష్మ వడ్డీ రుణాల బారిన పడి బతుకులు బుగ్గి చేసుకోవద్దని, వారు సులభ మార్గంలో రుణాలు ఇస్తామని ఆశ చూపి అధిక వడ్డీలు వసూలు చేసే ఆ మైక్రో ఫైనాన్స్ సంస్థల బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని తహశీల్దారు ధనంజయులు ప్రజలకు తెలియజేశారు. మండలంలోని రేగళ్లు పంచాయతీ యల్లంపల్లెలో సోమవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేగళ్లు పంచాయతీలో మైక్రో ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు తిరిగి డ్వాక్రా సంఘాల మహిళలకు రుణాలు ఇస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంఘాల ద్వారా అవసరమైన వారికి అవసరమైన సమయంలో అవసరమైనంత రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. ఎఒ రమాదేవి మాట్లాడుతూ తమ శాఖ ద్వారా వ్యవసాయ డ్రోన్ల మంజూరుకు అవకాశం ఉందని, ఆసక్తి గల గ్రూపు సభ్యులు తమను సంప్రదిస్తే మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డాక్టర్ మురళీమోహన్ రెడ్డి, ఎస్‌ఐ రమణ, ఏపిఎం లక్ష్మణ్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ సతీష్, పంచాయతీ కార్యదర్శి అయ్యప్ప, సంక్షేమాధికారి వినాయకం ప్రకాష్, విఎఒ కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

ప్రజాశక్తి- కలకడ

ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన సంఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని సింగనొడ్డుపల్లికి చెందిన శివ(33) రమణమ్మ జీవనోపాధి కోసం మదనపల్లెలోని నీరుగుట్టపల్లిలో కాపురం ఉంటున్నారు. శివ భార్య రమణమ్మ తన ప్రియుడుతో కలసి ఆదివారం రాత్రి నీరుగుట్టపల్లెలో హత్య చేశారు. అనంతరం తమ సొంత ఊరైన సింగనొడ్డుపల్లికు తన భర్త శివ మృతదేహాన్ని తీసుకుని వచ్చే ఖననం చేయడానికి ప్రయత్నించారు. శివ ఒంటిపై ఉన్న గాయాలను చూసి బంధువులు మదనపల్లి సిఐ మహబూబ్ బాషాకు ఫిర్యాదు చేశారు. ఆయన తన సిబ్బందితో సింగనొడ్డుపల్లికు వచ్చి శివ మృతదేహాన్ని మదనపల్లికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

జాతీయ సదస్సును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో నవంబర్ 17, 18వ తేదీలలో నిర్వహించనున్న జాతీయ సదస్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల చైర్మన్ చొప్పా గంగిరెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో జాతీయ సదస్సుకు సంబంధించిన కర పత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయో ఫార్మా సంవాద్ -2023 అను పేరుతో ఔషధ రంగం, జీవిత శాస్త్రాలలో నూతన అంశాలు అను ఉద్దేశంతో రెండు రోజులు పాటు ఈ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో పాల్గొనటానికి ఆసక్తి కలిగిన లైఫ్ సైన్సెస్ విద్యార్థులు, సదస్సు నిర్వహణ కార్యదర్శికి 9908344380 అను నెంబర్ ద్వారా, సమన్వయకర్తలను 9912396907, 8500000075 నెంబర్ల ద్వారా చరవాణిలో సంప్రదించాలని తెలిపారు. ఈ సదస్సు నిర్వహణ పట్ల కళాశాల కోశాధికారి, సి.అభిషేక్‌రెడ్డి, వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి, చైర్మన్ సి.రామచంద్రారెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత, డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి, డాక్టర్ పి.అనిత, అధ్యాపకులు ప్రదీప్ కుమార్, గిరీష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా వెంకటరెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమయ్య ప్రెస్‌క్లబ్ నూనత కార్యవర్గాన్ని సోమవారం మాజీ అధ్యక్షులు జంబు సూర్యనారాయణ అధ్యక్షతన ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షులుగా ఇండ్లూరి చిన్న వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులుగా దార్ల శ్రీనివాసులు ఆచారి, పాబోలు ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా బచోటి భాస్కర్, కార్యదర్శులుగా తుపాకుల సురేష్, బత్తిన రామసుబ్బారెడ్డి, షేక్ అలీషేర్, కోశాధికారి జి.వి.పి.ఆర్.కె రాయల్, సహాయ కార్యదర్శులుగా ఎం.ఓబులేసు, మందా శివయ్య, కళాంజలి కళ్యాణ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ద్వారకా గోపీనాథ్, కూరాకు శ్రీనివాసులు, ప్రచార కార్యదర్శులుగా నామా హరినాథ్, బి.సునీల్, సి.వెంకటేశ్వర రాజు, కార్యవర్గ సభ్యులుగా కె.వి.సుబ్బయ్య, నరసింహులు, పి.దుర్గయ్య టి.చంద్రశేఖర్, పి.దివాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. జర్నలిస్టులు ఐకమత్యంతో వ్యవహరించి హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాలికలతో పాఠశాల పీడీ బాలశేఖర్

బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- పుల్లంపేట

మండల పరిధిలోని జడ్‌పిహెచ్‌ఎస్ కొత్తపేట పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న బాలికలు సోమవారం ప్రొద్దుటూరులో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-17, అండర్-14 బాల్ బ్యాడ్మింటన్ ఎంపికల్లో పాల్గొన్న నలుగురు బాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ బాల శేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాల శేఖర్ మాట్లాడుతూ నవంబర్ 4వ తేదీ నుంచి ఆరవ తేదీ వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. బాలికలు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని అదేవిధంగా రాష్ట్ర స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలపారు.


ఎద్దుల సుబ్బరాయుడును సన్మానిస్తున్న జగన్‌మోహన్‌రాజు

ఎద్దుల సుబ్బరాయుడుతో 'చమర్తి' భేటీ

ప్రజాశక్తి - నందలూరు

రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు మాజీ ఆర్టీసీ రీజినల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడుతో నందలూరులోని ఆయన స్వగృహంలో సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన, చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు, రాబోవు ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయానికి, జనసేన పార్టీతో కలిసి ముందుకు సాగాలని నిర్ణయించారు. అనంతరం ఎద్దుల సుబ్బరాయుడును, రాజంపేట మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎద్దుల విజయ సాగర్‌ను శాలవాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి సమ్మెట శివప్రసాద్, తెలుగు యువత నాయకులు తోట శివశంకర్ పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం తప్పదు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రానున్న 2024 ఎన్నికల్లో వైసిపి అరాచక పాలనను తరిమి కొట్టి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎన్నారై టిడిపి కువైట్ ప్రధాన కార్యదర్శి మల్లి మారోతు అన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపుమేరకు కువైట్ నగరంలో జగనాసురుడికి కళ్ళు తెరిపిద్దాం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన చంద్రబాబు అక్రమ అరెస్టును అన్ని రాష్ట్రాలు ఖండిస్తున్నామని పేర్కొన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రతిపక్ష నేతను అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. రాష్ట్రంలో టిడిపికి పెరుగుతున్న ఆదరణ ఓర్వలేక అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. అనంతరం అధికార పార్టీకి వ్యతిరేకంగా కళ్ళకు గంతులు కట్టుకొని నినాదాలు చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బిసి అధ్యక్షులు శంకర్ యాదవ్, గుండయ్య నాయుడు, మళ్లీ శెట్టి రవి, ఎన్‌టిఆర్ సేవాదళ్ కస్తూరి కోటేశ్వర్, రెడ్డయ్య నాయుడు, నర్సారెడ్డి పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు